


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

13

## అయిదు పైసలకు ఆనంద భాష్పాలు

(సెప్టెంబర్, 24- 1976, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**"ఏది ధర్మం? ఏది అధర్మం? ఏది సత్యం? ఏదసత్యం - ఓ మహాత్మా!"**

ధర్మాన్ని గురించి వ్రాయాలన్నా, చెప్పాలన్నా - ఎన్ని గ్రంధాలో వ్రాయాలి - ఎన్ని సంవత్సరాలో ఉపన్యాసమివ్వాలి. అదైనా ఎవరికి తోచింది వారు చెపుతారు గాని - అందరికీ పనికివచ్చే ధర్మాలు చెప్పలేరు. అందరికీ ఆచరణ యోగ్యంగా ఉండేవి - ఆమోదకరంగా ఉండేవి అంతకన్నా చెప్పలేరు.

పెద్ద పెద్ద ధర్మాల్ని గురించి ఇక్కడ ప్రస్తావించలేంగాని - నిత్యజీవితంలో అనుకోకుండా జరిగే ధర్మాలను గురించి విచారిద్దాం.

చాలామంది ఎంతో ఆప్యాయంగా కాస్త అవకాశం దొరికితే - ఆలింగనం చేసుకునే వరిలాగా కనిపిస్తారు. ఆదిలో అతిమర్యాద - బలవంతపు అతుకులాగా కనిపిస్తుంది.

కానీ ఒక మానవుడు మాట్లాడుతుంటే రెండో మానవుడు ఎలా నమ్మకుండా ఉండగలడు? ఏ నాలుక తాటాకో, ఏ నాలుక చివురాకో ఎలా తెలుస్తుంది ముందర. రెండుమూడుసార్లు రుజువయిన తర్వాత గాని ఈ 'మాట నమ్మకురా మానవుడా?' అనే ఉద్బోధ బయలుదేరదు.

ఇలా మొదటి ఒకమాట, తర్వాత మరోమాటా మాట్లాడేవాళ్ళ జాబితాలు తయారుచెయ్యడం కష్టం. ఎవరికి వారే ఇలాటి వారిని గురించి, గ్రహించి, 'మాట నమ్మకూడదు' అనుకుంటూ ఉండడం మంచిది.

రిక్షా ఎక్కుదామని వెడతామనుకోండి. "రండి అయ్యా! రండి! ఎక్కండి. మీ దయవచ్చినంత ఇవ్వండి" అంటారు. ఎందుకైనా మంచిదని అర్ధరూపాయి ఇస్తాం. అది మామూలు. కనుక ముందే చెప్పుతున్నా - అని ఎక్కేవారు మనస్సును దిటవు చేసుకొని సీటులో చేరతారు.

రిక్షా గమ్యానికి కొంచెం కొంచెం దూరముండగానే

'ఎక్కడయ్యా? ఇంకెక్కడ?' అని ప్రశ్న వస్తుంది.

'కొంచెం ముందు' అంటాం.

'ఇంకేం ముందు మరో పేటకు వెడుతున్నాం' అనడం.

దిగిన తర్వాత అర్ధరూపాయి చేతిలో పెడితే

'చాల్లేవయ్య ఇంతదూరం తీసుకొచ్చి అర్ధరూపాయి ఇస్తున్నావా! తే - తే ఇంకో ఇరవై పైసలు' అనడం. - తగాదా ప్రారంభం! చివరికో పది పైసలు ఎక్కువ ఇవ్వడం అవతల వ్యక్తి 'పోవయ్య పో ఇచ్చావుగాని పది పైసలు. ' అని విసుక్కుపోతూ ఉంటారు.

ఇందులో ఏది ధర్మం? ఏది అధర్మం? బాగా ఆలోచిస్తే, అడిగి ఇంకో పదిపైసలు తీసుకోవడం ధర్మం అవుతుందేమో.

నేనొక ముసలి వాడి రిక్షా తొక్కుతున్నంతసేపూ "అయ్యో! అతడికి కూడా నా వయస్సు ఉందే! నేను రిక్షాలో కూర్చుని అతణ్ణి బాధపెడుతున్నానే" అనిపించింది. ఎందుకింత వయస్సులో కూడా అవస్థ పడుతున్నాడనిపించింది.

"తాతా! కుమారుళ్ళున్నారా? అన్నాను

"ఉన్నారు బాబూ" అన్నాడు.

తర్వాత ప్రశ్న వేయలేకపోయాను. అంతా అతని గొంతులోనే అర్ధమైపోయింది. ఇలాంటి సందర్భాలలో - నాకు కుమారుళ్ళు లేరనే అసంతృప్తి తొలిగిపోయి - అంతులేని సంతోషం వస్తూ ఉంటుంది.

రిక్షా మా ఇంటి దగ్గర ఆగిన తర్వాత ఆ తాతను అడిగాను. "కొడుకులు సంపాదించడం లేదా? అని.

"లేదు బాబూ వాళ్ళకూ నేనే పెట్టాలి. నేనూ, ముసలిదీ తినాలి. మొన్న మా చిన్నాడు వంట్లో జబ్బుగా ఉందని దాచిన ఇరవైరూపాయలు తీసుకుపోయాడు" అన్నాడా తాత.

జేబులో నుంచి చిల్లర తీశాను. అతనికిస్తానన్నదానికన్నా అయిదు పైసలు ఎక్కువ ఉన్నాయి. అవి కూడా ఇచ్చేశాను - పెద్ద త్యాగం చేసినట్లు, అతడు ఎంతో ఇదైపోయాడు. 'మీ దయ' అని నమస్కరించాడు. అతని కళ్ళల్లో ఆనందబాష్పాలు చూశాను. అవి అయిదుపైసల వల్లనే కాదు - ఆదరణగా మాట్లాడినందుకై ఉండాలి.

ఆ తాతను కుమారుళ్ళు వదలడం ధర్మమా! వాళ్ళ అనారోగ్యం కోసం ఇంకా తాపత్రయం పడుతూ ముసలి నరాల్ని మెలిపెట్టి సంపాదించడం ధర్మమా!. దేనికదే ధర్మం. ఎవరు చేసేది వారికే ధర్మం.

మొన్న ఒకాయన కుమార్తె వివాహం విషయంలో నానా అవస్థా పడుతూ, కనిపించిన వాళ్ళనల్లా సంబంధాల విషయం అడుగుతూ, తిరుగుతున్నాడు. ఎక్కడో ఒక సంబంధం ఉన్నదని తెలిసి - వారి ఇంటికి వెళ్ళి - వచ్చి తన కుమార్తెను చూడమని ప్రార్ధించాడు.

పెళ్ళికొడుకు ఏదో నాలుగైదు వందలు సంపాదిస్తున్నాడు. 'ఫర్వాలేదు - ఫామిలీ ప్లానింగ్ ఆచరణలో పెడితే - ఇంటి అద్దె కట్టి ఇంత రేషన్ తెచ్చి ఇంట్లో పడేస్తాడు' అనుకున్నాడు తండ్రి.

సరే పెళ్ళికూతుర్ని చూడటానికి వచ్చారు. ఆ అమ్మాయి బి.ఏ పార్టు తప్పి మూడు పరీక్షలకు హాజరై ముక్తి పొందడానికి ప్రయత్నిస్తోంది. అవతల వాళ్ళు డిగ్రీ మాట ఎక్కువ పట్టించుకోలేదు. పాణిగ్రహణానికే ప్రాధాన్యమిచ్చారు.

సరే వాళ్ళు వచ్చారు. పిల్లను చూశారు. వీళ్ళు పిల్లవాణ్ణి చూశారు. కేకులు తిన్నారు. టీ సేవించారు. వక్కపొడి నమిలారు. అలవాటున్న వాళ్ళు సిగరెట్లు కాల్చారు లేనివాళ్ళు ఆ ధూపం ఆఘ్రాణిస్తున్నారు.

పిల్లవాడి తండ్రి 'మాకు అమ్మాయి నచ్చింది. తక్కిన వివరాల తర్వాత మాట్లాడుకుందాం' అన్నారు. పిల్ల తండ్రి ముఖం పిండి జల్లడంత అయింది. ఆయన భార్య 'అమ్మయ్యా' అని ఒక పెద్ద నిట్టూర్పు విడిచింది.

ఇంతలో పెళ్ళి కుమార్తె లేచి నిలబడి గంభీరమైన కంఠంతో 'పెళ్ళి కుమారుడు నాకు నచ్చలేదు. సినిమా హీరోలాగా ఉండాలి నేను చేసుకో తలచిన పిల్లవాడు' అంది. అంతా తెల్లముఖం వేశారు. పెళ్ళి కొడుకు తండ్రి కళ్ళు ఎర్రచేశాడు. పెళ్ళికొడుకు ఫోజు పెట్టి లేచాడు.

పెళ్ళికుమారుడు తల్లిమాత్రం 'కావాలంటే ఎపుడో అయ్యేవాడు. దిష్టి కొడుతుందని మేమే వెళ్ళనియ్యలే' అన్నది. అప్పటికే తక్కినవారు వెళ్ళి టాక్సీలో కూర్చున్నారు.

రూపం ధర్మమా? గుణం ధర్మమా? ఆపేక్ష ధర్మమా? ఆశయం ధర్మమా?

Comment on this article..